క్లుప్తంగా...

నేడు గురుపూజోత్సవం

రాజేంద్రనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గోల్కొండ విభాగ్ ఆధ్వర్యంలో గురుపూజ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఉప్పర్‌పల్లిలోని సామా భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. హిందూధర్మానికి ప్రతీకగా ఉన్న పరమ పవిత్ర భగవధ్వజాన్ని సంఘంలో గురువుగా భావించి భక్తి శ్రద్ధలతో పూజించడం పరిపాటి అన్నారు. ముఖ్య అతిథిగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అజీవన సభ్యులు అర్వింద్ సహట, విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ కన్నేగంటి కృష్ణ తదితరులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి స్వయంసేవకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ప్రతి కాలనీలో పైప్‌లైన్ వేయాలి



గోల్కొండహిల్స్‌లో సర్వే చేస్తున్న జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి

మణికొండ: తాగునీటి పైప్‌లైన్లు లేని ప్రతి కాలనీలో వేయడంతో పాటు వీధిదీపాలను కూడా ఏర్పాటు చేయాలని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ ఆదేశించారు. శనివారం ఆయన ఆదేశాల మేరకు జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి గోల్డెన్‌వ్యూ కాలనీ, గోల్కొండ హిల్స్, పటేల్ ఎన్‌క్లేవ్, పాషాకాలనీల్లో పర్యటించి పైప్‌లైన్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్‌లను తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ప్రజలకు సరిపడ నీటిని ఇవ్వటంలో జలమండలి అధికారులు విఫలం అవుతున్నారన్నారు. అలిజాపూర్ గ్రామం, డాలర్‌హిల్స్, బయోడ్‌కాలనీ, తిరుమలహిల్స్ కాలనీలలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధిదీపాలను ఆయన ఆదేశాలతో శనివారం ఏర్పాటు చేశారు. కో–ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.


దాతల సహకారం అభినందనీయం



పెద్దషాపూర్‌లో సోలార్ వీధిదీపాలను ప్రారంభిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పెద్దషాపూర్ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ అన్నారు. కాలిన్స్ ఏరోస్పేస్ కంపెనీ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మద్దతుతో మండలంలోని పెద్దషాపూర్ గ్రామంలో సోలార్ వీధిదీపాలు, సోలార్ విద్యుదీకరణ ప్రాజెక్టు, ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ టీవీ యూనిట్లను ఏర్పాటు చేయగా శనివారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య, ఉపసర్పంచ్ మల్లమ్మ, వార్డు సభ్యులు, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, సంస్థ ప్రతినిధులు, దాతలు సురేందర్, గౌతమి, ప్రధానోపాధ్యాయులు సుఖేందర్‌రెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల' ఓఎస్డీ ఆకస్మిక తనిఖీ



మణికొండ: సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల రాష్ట్ర ఓఎస్డీ చంద్రకాంత్ నార్సింగి బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బాలికల ఆరోగ్యం, భోజనం, స్టాఫ్ నర్స్ రికార్డులను పరిశీలించారు. మెరుగైన వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్ అపరిశుభ్రంగా ఉండటం, విద్యార్థినిలు అనారోగ్యానికి గురవడంపై ఆయన ప్రిన్సిపాల్, స్టాఫ్ నర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఆయన మరింత నాణ్యత పెంచాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ కృపావరం, స్టాఫ్ నర్స్ విక్టోరియా, ఏఏన్ఎం తేజ తదితరులున్నారు.

పాఠశాల దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలి

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని మేకల బండ సెయింట్ అరబిందో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభా వర్మ అన్నారు. పాఠశాల 44వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు రజ్జులాల్ వర్మ, ఉపాధ్యక్షులు టీవీ నారాయణరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి చంద్ర ప్రకాష్ వర్మ పాల్గొన్నారు.

తవ్వారు.. మళ్లీ వేస్తున్నారు..!

- జలమండలి రోడ్ల తవ్వకాలు
- కౌన్సిలర్ల నిధులతో ఇష్టానుసారంగా పనులు
- బాగున్న రోడ్లనే తిరిగి వేస్తున్న వైనం

సాధారణంగా బీటీ రోడ్లను రెండేళ్లకోసారి, సీసీరోడ్లను పది నుంచి 15 ఏళ్లకోసారి కొత్త రోడ్లు వేస్తారు. దీనికి భిన్నంగా సీసీ రోడ్లను వేసిన ఐదు నెలల నుంచి ఐదేళ్ల లోపే మరోమారు వేస్తూ.. నిధులను వృథా చేస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.



ఎస్సీకాలనీలో తిరిగి వేస్తున్న రోడ్డు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో జలమండలి అధికారులు ఇటీవల కొత్తగా రిజర్వాయర్లు నిర్మించడంతో వాటిని అనుసంధానిస్తూ.. పైప్‌లైన్ల పనులను చేపడుతున్నారు. దీంతో ఆరునెలల క్రితం వేసిన రోడ్లను సైతం ధ్వంసం చేస్తున్నారు. అలా తవ్వకాలు చేసిన రోడ్ల మరమ్మత్తులను వారే చేపట్టాల్సి ఉన్నా.. తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల సమన్వయ లోపం..

- మున్సిపాలిటీ, జలమండలి శాఖల మధ్య సమన్వయలోపం, కౌన్సిలర్ల వారీగా నిధుల కేటాయింపు వెరసి కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని నార్సింగి వాసులు వాపోతున్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో గత ఐదేళ్ల క్రితం గ్రామ పంచాయతీ ఉన్నప్పుడే దాదాపు అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. మిగిలిపోయిన రోడ్లను మున్సిపాలిటీ ఏర్పడినప్పుడే పూర్తి చేశారు.



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డు ఇలా..

కౌన్సిలర్ వారీగా నిధులు..

- మున్సిపాలిటీలలో ఉన్న ప్రజావసర పనులను గుర్తించి వాటికి ప్రాధాన్యతను బట్టి పూర్తి నిధులను ఒకేసారి కేటాయించి టెండర్లు పిలిచి పనులను చేపట్టాలి. నార్సింగి మున్సిపాలిటీలో ఉన్న కోట్లాది రూపాయల నిధులను కౌన్సిలర్ల వారీగా ఒక్కో సమావేశంలో రూ. 30 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు పంపకాలు చేసుకున్నట్టు సమాచారం.
- మున్సిపాలిటీ పరిధిలో అత్యధిక సమస్యలు ఉన్న వార్డులను వదిలేసి పనులే లేని వార్డులకు నిధులను కేటాయించి వృథా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి నార్సింగి మున్సిపాలిటీలో అవుతున్న నిధుల వృథాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వార్డుల వారిగానే నిధులు తీసుకుంటున్నారు



మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన పనులను చేపట్టేందుకు సమిష్టిగా నిధులను వినియోగించాలి. అవసరమైతే ఒకే వార్డులో పెద్ద సమస్య ఉంటే రూ. 10 కోట్లైనా ఖర్చుచేసి ఆ సమస్యను నివారించాలి. నార్సింగిలో కౌన్సిలర్లు అన్ని వార్డుల్లో సమస్యలు ఉన్నాయని వాటికి నిధులు కావాలని అడుగుతున్నారు. కౌన్సిల్ సమావేశంలో వార్డుల వారీగా పనులను చేపట్టాలని తీర్మానం చేస్తున్నారు. తప్పనిసరిగా అత్యవసరం లేని పనులను ముందుగా చేపట్టే పరిస్థితి ఉన్న మాట వాస్తవం.

– ఎ. సత్యబాబు, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

ప్యాచ్‌వర్క్‌లు సంబంధం లేదు

మున్సిపాలిటీలలో పైప్‌లైన్లు వేసి ప్రజలకు కావాల్సినంత తాగునీటిని అందించేందుకే రిజర్వాయర్ల నిర్మాణం, పైప్‌లైన్ పనులను చేపడుతున్నాం. ఔటర్‌రింగ్ రోడ్డు లోపల పనులను చేపడతామని మూడేళ్ల క్రితమే ప్రభుత్వం ప్రకటించింది. అలాంటి చోట్ల రోడ్లు వేయటం ఎవరి తప్పు. పైప్‌లైన్లు వేశాక ప్రధాన రోడ్లలో ప్యాచ్ వర్క్‌లను తమ శాఖ చేపడుతుంది. లోపలి రోడ్లలో మున్సిపాలిటీ వారే చేపట్టాలి.

– రవీందర్‌రెడ్డి, జీఎం, జలమండలి

తవ్వకాలతోనే రోడ్లు పాడవుతున్నాయి

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో గత మూడేళ్లలో వేసిన అనేక రోడ్లను జలమండలి సిబ్బంది తవ్వి పాడు చేశారు. తవ్విన రోడ్లతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట తదితర గ్రామాల్లో ప్రస్తుతం ప్రధాన రోడ్లు ధ్వసంమయ్యాయి. తవ్విన వారే ప్యాచ్ వర్క్‌లు చేస్తే మున్సిపాలిటీ నిధులు వృథా కావు. వారు ఆ పనులను మావి కానట్లుగా వదిలేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో మేము చేయించాల్సి వస్తోంది.

– నరసింహారాజు, డీఈ, నార్సింగి మున్సిపాలిటీ

పగలే వెలుగుతున్న వీధిదీపాలు



అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం అదుపు లేకుండా పోతుంది. పట్టపగలు సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలుగుతున్నాయి. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ కమిషనర్ చైర్మన్ నియామకంపై జాప్యం



మాట్లాడుతున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లినరేందర్

శంషాబాద్: ఎస్సీ కమిషనర్ చైర్మన్ పదవి ఖాళీ ఉండి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. దళితుల సంక్షేమంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షతకు ఇదే నిదర్శనమని ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి దళితులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తోందని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి పదవి దగ్గరి నుంచి దళితులకు మూడెకరాల భూమి చెప్పిన వాగ్దానాలు నెరవేరలేదన్నారు. దళితబంధు కూడా బీఆర్ఎస్ నేతలకే పరిమితమైందని వాపోయారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని కవ్వగూడలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్, పలకలను పంపిణీ చేశారు. దాత కుక్కల బాలు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన సూచించారు. విద్యార్థులకు తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.



తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రత్యేకచొరవ తీసుకున్నామన్నారు. కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, అశోక్, గిరి, రవి, ప్రవీణ్‌చారి, నర్సింగ్‌గౌడ్, రాజిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీవిరమణ.. సన్మానం

బండ్లగూడ: జలమండలిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. శనివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాళీకానగర్‌కు చెందిన బాలకృష్ణ జలమండలిలో ఉద్యోగం చేసి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. శేఖర్‌బాబుయాదవ్, రఘురామ్‌గౌడ్, యాదయ్య, బుచ్చయ్య, నర్సింహ్మ, శ్రీశైలం, రాజ్‌కుమార్, జగన్‌గౌడ్, మల్లేష్, శ్రీను తదితరులున్నారు.



38 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన రామకృష్ణయాదవ్ పదవీవిరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం ఎన్ఐఆర్‌డీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణయాదవ్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎన్ఐఆర్‌డీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎన్ఐఆర్‌డీ అధికారులు, సిబ్బంది, రామకృష్ణ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: ఎన్ఐఆర్‌డీలోని వివిధ విభాగాల్లో



పెరుగుతున్న ప్రజా సౌకర్యాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శనివారం నార్సింగిలో ఔటర్‌రింగ్ రోడ్డు ఇంటర్‌చేంజ్‌ను మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నార్సింగిలో ఔటర్‌రింగ్ రోడ్డు ఎక్కే సౌకర్యం కావాలని పదేళ్లుగా స్థానికులు కోరుతున్నారన్నారు. ప్రస్తుతం నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. మూసీనదిపై 14 వంతెనల నిర్మాణాలకు నిర్ణయించి ముందుగా రాజేంద్రనగర్‌లోని 5 వంతెనలకు టెండర్లను పిలిచారన్నారు. తాగునీటి సరఫరాకు అవసరమైన చోట రిజర్వాయర్‌లను నిర్మించారన్నారు. నార్సింగి మున్సిపల్ చైర్మన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలు మంత్రులకు ఘనస్వాగతం పలికారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ ఎ.సత్యబాబు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఔటర్ ఇంటర్‌చేంజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మంత్రులు

బార్‌లో పనిచేసే యువకుడి ఆత్మహత్య

శంషాబాద్: బార్‌లో పనిచేసే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని వేంకటేశ్వర బార్‌లో బిహార్‌కు చెందిన అవ్‌దేష్‌కుమార్ యాదవ్ (23) ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. కాగా విధులు ముగించుకుని పక్కనే ఉన్న గదిలో నిద్రకు ఉపక్రమించాడు. శనివారం మధ్యాహ్నం మరికొంత మంది సిబ్బంది అక్కడికి వెళ్లేసరికి టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

కేంద్రంలో సుపరిపాలన.



మణికొండ: కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలతో సుపరిపాలన కొనసాగుతుందని వాటి గురించి ఇంటింటికీ వివరిస్తుంటే ప్రజల్లో అనూహ్య స్పందన వస్తోందని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పంచవటీ కాలనీలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా పాలన కొనసాగుతుండటంతోనే దేశంలో గత 60 ఏళ్లలో జరగని ప్రగతి నేడు కొనసాగుతుందన్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌రెడ్డి, మహిళా జిల్లా కార్యదర్శి సీహెచ్. ఇందిర, కౌన్సిలర్ ఎల్.వందనానగేష్, కో–ఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె.లక్ష్మీరాములు, నాయకులు ఎం.రాఘవరెడ్డి, ఆనందరావు, అనితాదేవి, నర్సింహాచారి తదితరులున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణేది..?



అత్తాపూర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



పేరుకుపోయిన వ్యర్థాలు

అత్తాపూర్: పారిశుద్ధ్య నివారణలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 9 ఏళ్ల స్వరాష్ట్ర పరిపాలనలో పారిశుద్ధ్య నివారణలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. పీ.వీ.నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 130 నుంచి అత్తాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ పొంగిపోర్లుతూ.. స్థానికంగా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను ఓపెన్ పాయింట్‌ల నుంచి తొలగించకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

మణికొండ: వాసవీకపుల్స్ క్లబ్ మణికొండ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం క్లబ్ సభ్యులు డాక్టర్ హిరణ్మయి, చందన, శ్రీకాంత్‌లను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.నిరీష మాట్లాడుతూ.. సమాజంలో దేవుని తరువాత స్థానం వైద్యులకే ఉందని మన ప్రాణాలను నిలిపేది వారేనని వివరించారు. క్లబ్ కోశాధికారి వంశీకృష్ణ, సహాయ కోశాధికారి రామ్ సురేష్, జిల్లా కో– ఆర్డినేటర్ ఈశ్వర్‌ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి



రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ 9 ఏళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని తమిళనాడు బీజేపీ వైస్ ప్రెసిడెంట్, విస్తారక్ ఆర్. లోగేంద్రన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో శనివారం 'హర్ ఘర్ మోదీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. గత తొమ్మిదేళ్లుగా కేంద్రం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ బీజేపీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడికే జనార్దన్, రావుల భాస్కర్, వెంకటరమణగుప్తా, నర్సింహ్మ, మురళీధర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, పాండుయాదవ్, చిన్న, రాజు, కృష్ణారెడ్డి, గణేష్, చింటురెడ్డి, శివారెడ్డి తదితరులున్నారు.

సాయినిఖిత అరంగేట్రం

రాయదుర్గం: సాయినిఖిత ఆంధ్రనాట్యం అరంగేట్రం సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. శనివారం రాత్రి గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బ్రహ్మకుమారీస్ సంస్థ రీజనల్ సెంటర్స్ ఇన్‌చార్జీ రాజయోగిని బీకే కుల్‌దీప్, కెమెరామెన్ ఎడిటర్, దర్శకుడు, నటుడు మీర్ ఎస్,సతీమణి భువనేశ్వరి, ప్రముఖ నటులు మధుశాలిని, గోకుల్ ఆనంద్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ఏరీస్ అవగాహన సదస్సు



సాక్షి, సిటీబ్యూరో: రాజేంద్రనగర్‌లోని తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో– ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ వేదికగా పంటలలో వచ్చే సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నూతన వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు 'టెక్నికల్, లీడర్ షిప్ ట్రైనింగ్' కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఏరీస్ ఫ్యూచురా ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం 3 రోజుల పాటు కొనసాగనుంది. ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయప్రదీప్ సుబ్రమణియన్ మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లో వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు, వ్యాపార–పరిశ్రమల రంగంలో ప్రసిద్ధి చెందిన నిపుణులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో పలువురు వ్యవసాయరంగ నిపుణులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.